❖ ❖ ❖

అతను మళ్ళా కళ్ళు విప్పేసరికి మొహానికి కంతా కాయితా లంటిచినట్టుంది. వంట్లో నీరసం జాస్తీగా వుంది. చేతులకి కట్లున్నాయి, బాధగా మూలిగాడు.

"అదృష్టవంతులు, ఏం ఫర్వాలేదు, అన్నీ చిన్న దెబ్బలే. బాగా షాక్ తిన్నాడంతే. రేపు డిచ్ఛార్జి చేసేస్తా" అన్నారు. అతనికి తెలిసిన గవర్నమెంటు డాక్టరుగారు. అప్పటిగ్గాని అతనికి పరిసరాలు పరిస్థితులూ గుర్తుకు రాలేదు. మంచం దగ్గర కాళ్ళ వేపు గుడ్లనీరు కక్కుతూ నిలబడిది తన భార్య. బస్సు దేన్నో గుద్దివేసుంటుంది.

మరే, ఆ ఫ్రంటుసీట్లో వుంటే ఏమయ్యుండేదో? ఊహించ దానికి భయమేస్తోంది అన్నారు, డాక్టరు ఇంగ్లీషులో.

దాంతో బాగా తెలివొచ్చేసింది రాజేశ్వర్రావుకి ఏం? ఏమైంది అని అడిగాడు.

డ్రైవరూ, ఫ్రంటుసీట్లో వున్నాయినా చచ్చిపోయారు. మిగతా అందరికి ప్రాణభయం లేదు.

రాజేశ్వర్రావు మాటాడలేదు.

ద్వారంలోనుండి సాయంత్రం నీరెండ చతురస్రా కారంలో గదిలో పడుతోంది.

పక్షులరుస్తూ తమ యిళ్ళకి వెళ్ళిపోతున్నాయి. మళ్ళీ ఈ ఎండా, ఈ పక్షులూ రేపు వస్తాయి. రేపు తను డిశార్జి ఐపోతాడు.

కాని ఆ ఫ్రంటు సీటువాడికి రేపు లేదు. పట్టుమని పాతికేళ్ల యినా తిరక్కుండానే బలవంతం చావు చచ్చిపోయాడు.

ఆలోచిస్తున్న రాజేశ్వర్రావు ఆ ఫ్రంటుసీట్లో వున్నదెవరో తెలుసా? మీ రిలీవర్ అన్న డాక్టరు మాటకి త్రుళ్ళిపడ్డాడు.

ఆ రిలీవర్ని చూడకముందే తిట్టేడు. చూసేక ఆక్షేపిం చాడు.

అతను తనను ఉద్యోగం నుండి రిలీవ్ చెయ్యడానికి వస్తున్నాడు.

ఫ్రంటు సీటు నుండి రిలీవ్ చేశాడు.

మృత్యువు నుండి కూడా రిలీవ్ చేశాడు.

అతను కేవలం రిలీవర్ కాదు, ప్రాణదాత.

సిగ్గుతో చేతుల్తో మొహం కప్పుకున్నాడు.

తాసిల్దార్ రాజేశ్వర్రావుకి తెగ దుఃఖం వచ్చింది.

*(రా.వి. శాస్త్రిగారి కార్నర్ సీటు చదివేక)*

***(31.12.1965)***

# పెట్టుబడి

**చే**తిలో టెస్ట్‌ట్యూబ్ కిటికీ వేపు తిప్పిచూశేడు మధు సూదన్. పచ్చటి యెండపడి అందులోని ద్రవ్యం బంగారు నీరులా ఉంది. అంతవరకూ తన తలమీదున్న కారుమబ్బు విడిపోయినట్టు రిలేఫ్‌తో నిట్టూర్పి అతను వెనక్కి తిరిగేడు. విశాలంగా వున్న ఆ లేబొరేటరి సీసాలూ, గాజుబీరువాలూ, యెటెండరూ తప్పిస్తే ఖాళీగా వుంది. ఒక మూలని స్టూలుమీద బోనులో గడ్డితింటున్న చెవుల పిల్లలు క్లాసులో పకోడీలు తింటూ మేష్టారుకి దొరికి పోయిన బడిపిల్లల్లా తిండి మానేసి అతని వేపు భయంకంటే ఎక్కువ భక్తితో చూశేయి,

మధుసూదన్ లేబరేటరీనుండి తన గదిలోకి వెళ్తున్నప్పుడు ఎర్రతివాసీ అతని జోళ్లచప్పుడు తనకింద దాచుకుంది. అతను గదిలోకి రాగానే యెటెండెంటు అతని నల్ల కోటు తీసి హేంగరుకి తగిలించి వాష్‌బేసిన్ దగ్గర తువ్వాలు పట్టుకొని నిల్చున్నాడు. అతను చేతులూ, మొహం కడుక్కున్నాక, కాఫీ కప్పులో పోసి, డ్రాయరులోనుండి సిగరెట్ కేసూ, లైటరుతీసి టేబులు మీద యాష్‌ట్రే పక్కన పెట్టేడు.

మధుసూదన్ వున్న ముప్పై ఏళ్ళకంటే మరో పదేళ్ళు యొక్క వున్నట్టు కన్పిస్తాడు. జుత్తుబాగా నెరియడం పోటోలో యాభైని దాటిన వాడిలా కనిపిస్తాడు. అతను వేసుకున్న సూట్ బాగా ఖరీదైనదైనా మూడేళ్ళనాటిది. అతని జోళ్ళు బాగా పాలిష్ చేయ బడిననైనా కొత్తవి మాత్రం కావు. అతని నిరంతరాలోచన అతని నుదుట మీద లోతు గీతలుగీసి పోయింది. అతని కళ్ళల్లోని "కలలు చూపు" అతను యీ లోకంవాడు కాడేమో ననిపిస్తుంది. అతను బరువైన మనుషుల్లోనే లెక్క.

సిగరెట్ యింకో నిమిషంలో అయిపోతుందనగా అతను ఎటెండెంటు వేపు చూశేడు. ఎటెండెంటు టేబిలు మీదున్న పోన్ చేశేడు. సిగరెట్ అయిపోయేసరికి కారు వచ్చి లేబొరేటరీ ముందు ఆగింది. కారు దగ్గరకు నడిచి వెళ్లి మధుసూదన్ లిఫ్ట్ ఇవ్వవలసిన స్నేహితుడికోసం ఆగిపోయినట్టు ఆగి, కాంపౌండులో మౌనంగా వున్న జంతుశాల వేపు చూశేడు. అదే టైముకి. ఉరకలు వేస్తున్న రెండు కుక్కల్ని గొలుసులతో ఆ పూతూ ఒక జవాను పరుగెత్తుకొచ్చేడు. ఆ కుక్కలు... తల్లిపోయిన పిల్లలు తండ్రిని చుట్టుకున్నట్టు మధుసూదన్ కాళ్లకు చుట్టుకున్నాయి.

మీదికిఎక్కి చేతులు నాకేయి అతను తమను యెత్తుకోనందుకు గారంగా అరిచేయి. అతని కడుపుమీద కాళ్ళు పెట్టి తోక లాడిస్తూ నిల్చున్నాయి. "ఇంక పొండి" అన్నాడు మధుసూదన్, జవాను కుక్కల్ని తీసుకుపోయాడు. ఆ కుక్కలు పూర కుక్కలు. వాటిని మధు సూదన్ సరిగ్గా 77 రోజుల కిందటి సంపాదిం చేడు. వాటిని సంపాదించడానికి....

ఆ రోజు... లేబరేటరి నుండి యం.డి. (మేనేజింగ్ డైరెక్టర్) ఆఫీసుకి వెళ్ళేడు మధుసూదన్. అప్పటికి సాయంత్రం నాలుగు కాలేదు, బొందితో కైలాసానికి తీసుకుపోయింది తొమ్మిదో అంతస్తుకు లిఫ్టు అతన్ని. వరండాలో నిలబడిని యూనిఫారం జవాను తీసిన గాజు తలుపులు దాటి ఆఫీసు చేరేడు అతను ఔటర్ ఆఫీసులో 60 ఎమ్. ఎమ్. సినిమా వేసుకొవచ్చు. అక్కడ చప్పుడు చెయ్యని ఫేను కింద వనచేస్తున్న మొగాళ్ళు సూట్ల ఎడ్వర్‌టైజ్‌మెంటు వాళ్ళలా ఉన్నారు. ఆడవాళ్ళు బట్టలషాపులో బొమ్మల్లా ఉన్నారు. యం.డి. ఆఫీసుద్వారం పక్కన సెక్రెటరీకి ఆకుపచ్చటి టేబిలుంది. ఆ టేబిలు నాచుపట్టిన చెరువులా కాకుండా బిలియర్డ్సు టేబిలులా ఉంది. దాని వెనుకనున్న సెక్రె టరి పళ్ళు కనిపించకుండా నవ్వడానికే పుట్నిట్టుంది. ఆమె వయస్సు పదేళ్ళనుండి ఒకచోటే వుంది. ఆమె రోజూ పాలల్లో స్నానం చేసేమనిషిలా మెరుస్తూ నున్నగా ఉంది. సిల్కు చీర జారకుండా పట్టుకునేందుకే ఎదిగేయా అనిపించేటంత ఎత్తు గానూ సూదిగానూ వున్నాయి ఆమె గుండెలు. అంత పెద్ద జుత్తుగాని లేకపోతే ఆమె మొహం పాలడబ్బాల ఎడ్వర్టయిజ్ మెంట్‌కి పనికివచ్చేది. అలాగని అమాయకురాలు మాత్రం కాదు. మూడు కాపురాలకి నిప్పుపెట్టింది. మరో యిద్దరు మొగాళ్ళు బికార్లు అయిపోయి దేశాలు పట్టిపోయేరు. ట్రావెల్స్ బంగాళాలకి, రెస్టుహౌసులకీ ఆమె రారు. "ఫైవ్‌స్టార్" హోటల్లోనే ఆమె పడుకుంటుంది.

ఎదురుగా వచ్చిన మధుసూదన్‌ని కూర్చోమని కళ్లతోనే సౌజ్ఞచేసి "డాక్టర్ మధుట" సీయు సర్" అని టెలిఫోనులో చెప్పి "రమ్మంటున్నారు" అంది మధుసూదన్‌తో.

మధు లేచి యం.డి. గదిద్వారం దగ్గిరికి వెళ్ళేడు. అక్కడ స్టూల్ మీద కూర్చున్న ఆఫీసుబోయ్ లేచి సలాం చేసి తలుపు తెరిచేడు. మధుసూదన్ గదిలోకి వెళ్ళగానే మాయా గుహ ద్వారంలా తలుపు మూసుకుపోయింది.

యం.డి. ఎయిర్ కండిషన్డు గది చెరువుకింద గదిలా చల్లగానూ, చీకటిచీకటిగానూ వుంది, అక్కడక్కడ దాగున్న దీపాలు వింతపాముల రంగుమణుల్లా మెరుస్తున్నాయి. గోడల్ని ఏ అలంకారాలూ లేవు పెద్దగ్లాస్ టాప్ టేబిలు వెనక కూర్చున్న యం.డి. వేసుకున్న సూటు వచ్చేసంవతసర్ం ఇండియాలో ఫాషన్లోకి వస్తుంది. అవసరం అయితే పదిమందిని కొట్టగలి దన్నట్టు బలంగా ఉన్న అతని వయసు చూడగానే ఎవరూ అంచనా వెయ్యడానికి ప్రయత్నించరు. విగ్గు పెట్టుకున్నాడా అని అనుమానం వచ్చేటంత దట్టంగావుంది ఆతని జుత్తు అతని పళ్ళు బము అందంగా వుండడంవల్ల అతను ఎప్పుడూ నవ్వుతూ వుండడానికే ప్రయత్నిస్తాడు. అతను జడ్జీ అయితే ముద్దాయికి ఉరిశిక్ష వేసినప్పుడు కూడా నవ్వుతూనే ఉండును.

చూస్తున్న కాగితం నుండి తన సోగ కళ్లు ఎత్తకుండా "సిట్ డౌన్, మైబోయ్" అన్నాడు అతను.

మధుసూదన్ కూర్చున్నాడు.

"ఏ విఁటిరా వచ్చేవ్? నాన్న కులాసాయేనా? అమ్మ డార్జి లింగ్ నుండి వచ్చేరా? నీ ఆరోగ్యం బాగుంటుందా? ఎన్నిసార్లు ఆఫీసుకు రమ్మని బతిమాలినా రాని వాడివి యీ వేళ్లైనా వచ్చేవు" అని "ఎందుకు వచ్చేవ్ !" అని అడగబోయి మానేసి చదివిన కాగితం సంతకం చేసేడు.

"నాకు కుక్కలు కావాలి" అన్నాడు మధుసూధను.

"కుక్కలా? ఎన్ని?" నాకు బలపం కావాలి అని మధుసూధను ఏడిచినా యం.డి. అంత ఆశ్చర్యపోయి వుండడు.

"పదో ఇరవయ్యో" మధు కళ్ళు దించుకున్నాడు.

"అని కుక్కలేం చేసుకుంటావ్? డాగ్ రేసింగ్ పెడతావా ఈ ముష్టిదేశంలో. లేకపోతే కుక్కల వ్యాపారం పెడతావా!" జవాబు చెప్పకపోయినా పరవాలేదన్నట్టు అడిగాడు.

"అంతకు తక్కువ సరిపోవు"

"ఇంతకీ నీకు కుక్క లెందుకయ్యా? అప్పుడే పిల్లలు పుట్టరని బెంగ పెట్టుకున్నావేఁవిటి? ఇంతకి కుక్కలు "సూ" కా! నీకా" గుక్క తిప్పుకోడానికి ఆగాడు యం. డి.

"నాకే" తన కుర్చీ వెనక కాళ్ళుచూస్తూ అన్నాడు మధుసూదన్.

"నీ కెందుకు బాబూ కుక్కలూ? కావాలంటే గుర్రాలు అడుగు. పందెవుగుర్రాలు పంపుతాను".

"కుక్కలే కావాలి"

"సరే ఏ జాతివి? ముద్దుగా జేబులో పడేసుకోవచ్చు, పెకినీస్ పంపమంటావా? లేకపోతే పామరేనియన్సు కావాలా? మొగాడిని కాబట్టి పెద్దకుక్కల కావాలేమో, ఆల్సేషియనులు మాత్రం వద్దు. ప్రతికిల్లీకొట్టు వెదవా ఒక ఆల్సేషియను పెంచుతున్నాడీ రోజుల్లో డాల్మేనీయన్సు – గోల్డెన్ రిట్రీ వర్సు – బ్లడ్ హౌండ్సు ... ఏవి కావాలి? లేకపోతే అమెరికను అంబాసిడరు పెళ్ళాం దగ్గరు ఏవో కొత్తరకాలున్నాయిట. రేపు కనుక్కుంటానుండు" ఎంత జోరుగా మాటాడుతున్నాడో అంత జోరుగానూ ఆలోచిస్తున్నాడు యం.డి.

"నా కవేం వద్దు. ఊరవి కావాలి"

"ఇప్పుడేవింటన్నావ్? మళ్ళీ అను" తన చెవులను మొదటిసారి శంకిస్తూ అన్నాడు యం.డి.

"ఊరకుక్కలు కావాలి"

"ఆడవా, మగవా?"

"ఏవైనా ఫర్వాలేదు. చర్మవ్యాధులున్నవి కావాలి"

"నీ క్కావలసింది కుక్కలూ కాదు, పిల్లులూ కాదు. అంత అంత అహోరాత్రాలు పనిచెయ్యకయ్యా అంటే వినకుండా మనసు చెడగొట్టుకేన్నావు. నెల శలవుయిస్తాను. హాయిగా 'సూ'తో దేశం తిరిగి రా. ఈ ఎండకి నేనే మా సెక్రెటరీని కరిచేస్తానేమో ననిపిస్తూంది. కుక్కలు దేనికి?"

"నేనుహాన్సన్సు డిసీజ్ (Hansons disease) కి మందు కనిపెడుతున్నాను"

"పేలకి, గజ్జికి కనిపెట్టలేక పోయేవ్? చూడూ. ఈ జబ్బులు బీదవాళ్ళవి. వాళ్లకి మందులు కొనుక్కోవడానికి డబ్బుండదు. మనం డాక్టర్లకిచ్చే ఫ్రీ సే పిల్సుమీద బతికేస్తారు. డయాబిటిస్‌కి మందు కనిపెట్టేవు. అది మన కంపెనీకి గోల్డ్‌మైను అయింది. బ్లడ్ ప్రెషరుకి కనిపెట్టేవు. అది డైమండ్ మైను అయింది.

మనది కంపెనీ, ధర్మసంస్థ కాదు. మనుషులందరికి కొన్ని రకాల జబ్బులొస్తే, పేలూ, గజీ, కుస్టు పేద వెధవలకే వస్తాయి. వాటికి మనం మందులు కనిపెడితే ముసుగులు వేసుకొని మిషనరీల మైపోవాలి, కొంచెం ముందూ వెనకా చూడు. గొప్ప వాళ్ళ జబ్బులకి మందు కనిపెడితే మనం నాలుగు డబ్బులు చేసుకోవచ్చు. నాకు తెలుసు, నువ్వు ఆదర్శాలు, ఆదర్శాలు అంటూ ఆకాశంలో మఠం పెడతావని. ఈ కంపెనీ నడపలేక నేను పిచ్చెక్కి పోతున్నాను"

"కాని..."

"నాకు తెలుసు. నువ్వు సైంటిస్టువి. ఇటొచ్చి పిల్లులు తే, అటొచ్చి పందికొక్కులుతే అనగలవు. కాని నాబాధ ఎవరితో చెప్పుకోను. తెల్లారిలేస్తే ఇనకంటాక్సు ఇనస్పెక్టర్ని అనో. డ్రగ్సు ఇనస్పెపక్టర్ని అనో వొకడు దిగిపోతాడు. ఆఖరికి మన అడ్వర్టయిజుమెంటు పిల్లలేదూ. చూడ్డానికి కర్రి గాడిదలా వుంటుందా! అయితేనేం ఫొటోలో నలుపయినా తెలుపైనా ఒకటేగా! కాస్త యెత్తు పల్లావున్న మనిషి. ఆ సంగతి దానికి తెలుసు. డెపిలేటరీ అడ్వర్టయిజుమెంటుకి నా ఫోటోయేనా. స్లిమ్మింగు అడ్వర్టయిజుమెంటుకి నా ఫోటోయేనా అని పేచీ పెడుంతోది యీవేళ. నువ్వు కూడా నా మాట కాదంటే నేను బతక లేను. కాబట్టి బాబ్బాబు, ఈ మందు మానుకో."

"మందు తయారైపోయింది ... ట్రయలేసుకోవాలి." "అయితే నే చేసే దేముంది? అది పనిచేస్తే చాలు పెద్దజబ్బుకి గొప్పమందు కనిపెట్టేమని చెప్పుకోవచ్చు. మందులు తయారయేక – దొరలు ఎవరో ఒకడు కుష్టురోగ నివారణ కేంద్రాలు పెడుతూనే ఉంటార్లే – వాళ్ళకి టోకున అమ్మేస్తాను–"

"మరి కుక్కలు–"

"మూడ్రోజుల్లో పంపిస్తాను. కాని ఒక్కమాట ఇటుపైన నువ్వు ఇలాంటి వెర్రిమొర్రి జబ్బులకి మందు కనిపెట్టే లోగానా చెవిని పడెయ్, ఆజీర్తికి మందు కనిపెట్టాలిగాని ఆకలికి కనిపెట్టి ఏం లాభం? మంచిది వెళ్ళు"

... మరో మూడ్రోజులకి పదికుక్కల్ని పంపేడు యం.డి. "బాబూ యీమారు ఏనుగులు కావాలంటే పంపు తానుగాని కుష్ఠుకుక్కలు మాత్రం అడక్కు" అంటూ.

వచ్చిననాడు యీ కుక్కలూ చెడ తినేసిన కుక్కల్లా వున్నాయి. ఇప్పుడు జబ్బు పూర్తిగా పోయినట్టే, అంటే ముందు బాగా పని చేసిందన్న మాట. కొద్ది మార్పులు చేస్తే యీ ముందు మనుషుల క్కూడా పనిచేస్తుంది.

ముందు తయారు చేసేక యండి అని కోరలేదు మధుసూదన్. అడిగితే రోగుల్ని పంపుతాడుగాని అతని లెక్చర్లు భరించడం కష్టం. అంచేత తనమందు వాడి ప్రయత్నించడానికి

ఎవర్నేనా కుష్టురోగుల్ని తెమ్మని తన జవానుతోనే చెప్పేడు మాధుసూదను, జవాను నలుగురు రోగుల్ని తీసుకొచ్చేడు. ముగ్గురు మొగా, ఒక ఆడ.

నరకంనుండి జారిపోయిన పాపుల్లా వున్నారువాళ్ళు.

వాళ్ళని చూస్తే నిన్నటి డిన్నర్ వాంతి అయేటట్టుంది.

వాళ్ళని సగం ఉడికించి, కాలినట్టున్నారు.

వాళ్ళ ముక్కులు విరిగి వాచివున్నాయి.

వాళ్ళ పెదవులు వాళ్ళే కొరికేసుకున్నట్టు ఉబ్బి వున్నాయి.

వాళ్ళ చెవులు యెవరో రాక్షసులు చెవులు తీసుకు వచ్చి అతికించినట్టు పెద్దవిగా వున్నాయి.

వాళ్ళ బట్టలకి రక్తం మరకలు లేచినోట చీము మరక లున్నాయి.

వాళ్ళ జుత్తు అంతా పీకేసి మళ్ళీ అక్కడా అక్కడా కొంచెం వెంట్రుకలు అతికించినట్టు అతిపల్చగా వుంది.

వాళ్ళ కళ్ళముందున్న డాబ్బాలలో చిల్లర డబ్బులున్నాయి.

వేళ్ళు పూర్తిగా ఊడనివాళ్ళ చేతుల్లో కర్ర చిడతలున్నాయి.

జవాను వాళ్ళకి మందుగురించి అంతా చెప్పేడు. ఆ మందు వాళ్లని కంపెని ఉచితంగా ఇస్తుందనీ. ఆరు నెలల్లో వాళ్ళు మామూలు మనుషులైపోతారనీ, ఆ అర్నెల్లూ కంపెనీయే ధళ్ళని పోషిస్తుందనీకూడా చెప్పేడు.

"ఆ తర్వాత" ఆడది అడిగింది.

మధుసూదనూ, జవానూ జవాబు చెప్పలేదు. "వద్దు బాబూ. దేశంలో కూలిలేదు. కూలిపుట్టదు. ఆకలికి కాలి సావాలి. జబ్బుతోనైనా నాలుగుకాలాలు బతకనీయండి బాబూ" అంటూ వెళ్లిపోయేరు వాళ్ళు వైద్యం వద్దని.

దూరమై పోతోన్న వాళ్ళవే పేచూస్తూ నిలబడ్డాడు మధు సూదను. వాళ్ళ వెనక సూర్యుడు భగ్గుమని మండుతున్నాడు.

**(యువ దీపావళి, 10.11.1971)**

# మారాజు

**వె**న్నెల్లల్లగావుంటే రాజమ్మ వెన్నెల్లాగే వుంటుంది. నల్లగా మెరిసే రాజమ్మ వొళ్ళు–తెల్లని వెన్నెల తారులో పడి జారిపోయి నట్టున్నా– ఆ వొంట్లో మెరుపుంది. మెరుపులో అందంవుంది. అందుకే రాజమ్మ పెనివిటికి రాజమ్మంటే మక్కువుంది.

ఓరోజు పైనున్న తెల్లని వెన్నెల్ని చూస్తూ, పక్కనున్న వెన్నెల్ని దగ్గరకి లాక్కున్న పెనివింటిన్ని వారించి "మావాఁ! నీకో మంచోర్త చెప్పనా!" అంది రాజమ్మ.

"ఏటే అది?" ఆత్రంగా అడిగేడు పెనివింటి. "ఏమంటే .... ఏమంటే ... నే చెప్పను ఫో" రాజమ్మ సిగ్గుపడితే నల్లని ముఖంలో కాస్తంత సిగ్గుమెరసి, తేనెలోకి జారిన గులాబీలా వుంది.

అప్పుడామె పెనివింటి "అదేటో చెప్పమని" బలవంతం చెయ్యలేదు. ఐదునిమిషాలాలోచించేక, నల్లవెన్నెల బుగ్గమీద ఓ చల్లని చిటికేశాడు. ఆ వేళకి వినాయకచవితి సరిగ్గా ఆర్నెల్ల మీద మరో రెండ్రోజులుంది.

❖ ❖ ❖

"మావాఁ యీడినాయకసవిత నాడుట్టేడు. యీడు గొప్పో డౌతాడు మావఁ! ఏనుగనాగే రాజాబతికీడిది" అంది రాజమ్మ వినాయక చవితినాడు.

పెనివింటి తెల్లగా నవ్వి నల్లటి పిల్ల వెన్నెలబుగ్గ మీద చల్లని ముద్దెట్టుకున్నాడు. "ఓల్రాజీ! నాకు నువ్వన్నా, సెంద్రుడన్నా, మాసెద్ద ఇష్టం. అంచేతాడికి సెంద్రన్నని పేరెట్టుకుందాం" అన్నాడు మురిపెంగా.

చంద్రన్న వినాయకచవితి వెళ్ళిన కొన్నాళ్ళకి పాకాడ్డం నేర్చు కున్నాడు. నేర్చుకుంటూన్నప్పుడొకసారి నేల్ని కనిపించిన కండ చీమని నోట్లో పెట్టుకుంటే, అదికుట్టి వాడేడ్చినప్పుడు "ఈడు మా అయ్యలాగే మాసెద్ద సరుకుమావాఁ" అంది రాజమ్మ వాడ్ని సముదాయిస్తూ. "ఔనే! మా గొప్ప సరుకు" అన్నవ్వేడు పెనివింటి. నవ్వి "ఆచారి మేష్టారు చేతీడిసెక్రం ఏయిద్దామే" అన్నాడు.

చంద్రన్న పుట్టిన కొన్నాళ్ళకి ఆచారి మేష్టారు వాడి జాతక చక్రం రాసేరు. రాసి– అందమైన అమ్మాయి జ్వరాన్ని డాక్టరతి జాగ్రత్తగా పరీక్షించినట్టు– చక్రాన్ని చాలాసేపు చాలా ఆసక్తిగా పరీక్షించి, "మాంచి చురుకైనవాడు, సహదేవుళ్ళాటివాడు. రాజ